క్లుప్తంగా

ఆత్మీయ సత్కారం

చిక్కడపల్లి: కళానిలయం ఆధ్వర్యంలో గానసభలో 'ఎందరో మహానుభావులు.. అందరికీ వందనాలు' పేరిట నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. అలనాటి అందాల నటీమణులకు ఆత్మీయ సత్కారం, నగదు పురస్కారాలను ప్రదానం చేశారు. భీష్మ సినిమాలో గుర్తింపు తెచ్చుకుని సినిమా పేరును ఇంటి పేరుగా మార్చుకున్న భీష్మసుజాతకు ఎన్టీఆర్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఎన్టీఆర్ కన్యాశుల్కం, సొంతఊరు, ఏఎన్ఆర్ దేవదాసు చిత్రంలో చిన్నప్పటి సావిత్రిగా నటించిన అనురాధకు ఏఎన్ఆర్ పురస్కారం, అనేక చిత్రాల్లో నటించిన జానపద బ్రహ్మ బి.విఠలాచార్య మోహిని శపథం చిత్రంలో నటించి మెప్పించిన లక్ష్మీప్రియకు బి.విఠలాచార్య మహానటుల పేరిట సన్మానించి నగదు పురస్కారం అందజేశారు. దైవజ్ఞశర్మ, బీజేపీ నేత వంశీ, కాపర్తి వెంకటేశ్వర్లు, అశోక్, రాధాకృష్ణమూర్తి, చలసాని ఝూన్సీరాణి, నాగరాజు, సినీనటులు మాణిక్, ఎంవీరావు, బద్రినాథ్, రామచంద్రరావు, నిర్వాహకులు సురేందర్, పుష్పలత తదితరులున్నారు.

అరోరాలో 'ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్'



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉస్మానియా టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని అరోరా కళాశాలలో 'సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ అండ్ ఎంటర్‌ప్రెనర్స్'ను ప్రారంభించారు. దీనికి ఓ ఏడాది పాటు ఒప్పందం కుదుర్చుకుని సంతకాలు చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వనాథం బులుసు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ ఇంక్యుబేషన్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, మేనేజర్ డాక్టర్ హఫీజ్‌భాషా తదితరులున్నారు.

వీఆర్ఏల పే స్కేల్‌ను అమలు చేయాలి



ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద..

కవాడిగూడ: సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా వీఆర్ఏలకు పే స్కేల్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో వీఆర్ఏలు నిరసన చేపట్టారు. బుధవారం అన్ని జిల్లాల నుంచి వేలాది మంది వీఆర్ఏలు తరలివచ్చి మౌనదీక్ష చేపట్టారు. ఈ దీక్షలో పెద్దఎత్తున వీఆర్ఏలు పాల్గొని తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. వీఆర్ఏల జేఏసీ చైర్మన్ ఎం.రాజయ్య, కో– చైర్మన్ రమేష్‌బహదూర్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.దాదేమియా, కన్వీనర్ సాయమ్మ, కో–కన్వీనర్‌లు రాములు, మహ్మద్ రఫీ, మాధవ నాయుడు, వెంకటేష్ యాదవ్, శిరీషారెడ్డి, ఎస్.గోవింద్, సునీత, నర్సింహ్మారావు తదితరులు పాల్గొన్నారు.

నాలా సమస్యను పరిష్కరించాలి

చిక్కడపల్లి: హుస్సేన్‌సాగర్ నాలా వెంట నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ వల్ల ఏర్పడుతున్న సీవరేజ్, కచ్చామోరీ ఓవర్‌ఫ్లో సమస్యను వెంటనే పరిష్కరించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అధికారులకు సూచించారు. డివిజన్‌లోని అరుంధతినగర్ బస్తీలో సీవరేజ్ లైన్, కచ్చామోరీ లైన్‌లు ఓవర్‌ఫ్లో కారణంగా మురుగు నిలిచి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆమె బుధవారం బస్తీలో జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, ఇరిగేషన్ ఏఈ శ్యామ్‌సుందర్‌లతో కలిసి పర్యటించారు. సానుకూలంగా స్పందించిన అధికారులు రెండు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించి నాలా పనులను చేపడతామని హామీ ఇచ్చారన్నారు. బీజేపీ నగర నేత వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ ఉమేష్, సురేందర్, నర్సింహ, స్థానిక బస్తీ నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

సన్మానం

చిక్కడపల్లి: దేశంలోనే మహిళల్లో అరుదైన వేణువాద కళాకారిణి దక్షిణ భారతంలో ఏకైక కళాకారిణి జయప్రద రామ్మూర్తి అని దూరదర్శన్ పూర్వ సంచాలకుడు డాక్టర్ పి.మధుసూదన్‌రావు కొనియాడారు. బుధవారం రాత్రి త్యాగరాయగానసభ ప్రధాన వేదికలో రాగరాగిణి ప్రముఖ మహిళ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ 16వ వార్షికోత్సవం సందర్భంగా జయప్రద రామ్మూర్తి అన్నమయ్య కీర్తనలు వేణువాద్య గోష్ఠిలో వినిపించారు. గీత రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, కళాపోషకులు సత్యనారాయణ, కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి, కళాభిమానులు రామమూర్తి నాయుడు, శైలజ, ఆనంద్, వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ రమణకుమారి, ప్రధాన కార్యదర్శి ఎంపీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ముసురుతున్న రోగాలు!

- అనారోగ్యంతో ఫీవర్ ఆసుపత్రికి క్యూ కడుతున్న రోగులు
- అప్రమత్తత అవసరమంటున్న వైద్యులు

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

నగరంలో చలి పంజా విసురుతోంది. రాత్రి వేళల్లో కాస్త మెరుగ్గా ఉన్నా.. తెల్లవారు జామున చలి తీవ్రత పెరుగుతోంది. వాతావరణ మార్పులకు తోడు ఇటీవల వచ్చిన క్రిస్మస్, సంక్రాంతి సెలవులకు చాలా కుటుంబాలు సొంతూళ్లు, బంధువుల ఇళ్లు, తీర్థ యాత్రలకు వెళ్లి వచ్చారు. వాతావరణంలో మార్పుతో ప్రతి ఇంటా రోగాలు ముసురుతున్నాయి.



ఫీవర్ ఆసుపత్రి ఎమర్జెన్సీ ఓపీ క్యూలైన్‌లో వేచి ఉన్న ఔట్ పేషెంట్స్

నల్లకుంట: పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు చలికి ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా దగ్గు, జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి సమస్యలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

- జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్న చాలా మంది చికిత్సల కోసం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. అదే సమయంలో ప్రభుత్వ ఆస్పత్రులంటే భయపడే మరి కొందరూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. రోగాల బారిన పడి ఫీవర్‌కు వస్తున్న వారిలో అధికంగా చిన్నారులు వృద్ధులు, మహిళలే ఉంటున్నారు.

గత వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందిన రోగుల వివరాలు..

తేదీ	ఔట్ పేషంట్లు	ఇన్ పేషంట్లు
జనవరి 26న	649	12
27న	600	20
28న	603	22
29న	212	11
30న	690	43
31న	645	26

ఈ ఏడాది ఫీవర్‌లో చికిత్సలు పొందిన రోగుల సంఖ్య..

- జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు ఓపీలో 16,691 మంది రోగులు చికిత్స పొందగా.. వారిలో వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న 648 మంది ఇన్ పేషంట్లుగా చేరి చికిత్స పొందినట్లుగా ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి.

చిన్నారులకు న్యూమోనియా..

- పిల్లలకు చల్లని గాలి తగిలిన వెంటనే న్యూమోకోకల్ వైరస్ వారిలో ప్రవేశించి న్యూమోనియా వచ్చే అవకాశం ఉందని పిల్లల వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మూడు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఉబ్బసం వ్యాధి అధికంగా వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ఆస్తమాతో అవస్థలు..

- పోషకాహార లోపంతో పిల్లలు, పెద్దల్లో ఆస్తమా వ్యాధి వస్తుంది. ఈ వ్యాధిగ్రస్తులు ముఖ్యంగా జలుబు, దగ్గు సమస్యతో అధికంగా బాధపడుతుంటారు. జ్వరం 102 డిగ్రీలకు చేరడం, కోరింత దగ్గు, ముక్కు కారడం వంటి వ్యాధి లక్షణాలు. 40 ఏళ్లు పైబడిన వారిలో ఈ లక్షణాలు అధికంగా కనపడతాయి.
- శీతాకాలంలో ఎక్కువగా గుండె, చర్మ, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తాయి. వీటికి తోడు ప్రయాణాల్లో కొత్త తాగు నీరు వాడకంతో మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదు.
- అధిక రక్తపోటు, మధుమేహం ఉన్న వారు సూర్యోదయం తరువాత జాగింగ్, వాకింగ్‌కు వెళ్లడం, వ్యాయామం చేయాలి.
- చలికి తెల్లవారు జామున 4 నుంచి 7 గంటల మధ్య గుండెకు సంబంధించిన సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.
- మంచులో ఆక్సిజన్ తక్కువగా ఉండటంతో ఆస్తమా బాధితులు ఇబ్బంది పడే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ముఖాన్ని సంరక్షించుకునేందుకు ఫేస్ క్రీమ్ బేస్డ్ మాయిశ్చరైజర్లు రాసుకోవాలి.
- ముఖానికి రాసుకునే కాస్మటిక్స్‌లో లోటస్, లయాన్, బయోటెక్, అలోవేరా, సెటాఫిన్ వంటివి ఉండేలా చూసుకోవాలి.
- స్నానానికి ముందు శరీరానికి గ్లిజరిన్, కొబ్బరినూనె వంటికి రాసుకోవాలి.
- స్నానానికి వాడే సబ్బులో టీఎఫ్ఎం 75 శాతం కంటే ఎక్కువగా ఉన్న వాటినే వాడాలి.
- ద్విచక్ర వాహనాలపై తిరిగే సమయంలో హెల్మెట్, జర్కిన్, షూస్, మాస్క్ ధరించడం మంచిది..
- మద్యపానం, ధూమపానం అలవాట్లు ఉన్న వారు చలి వాతావరణాన్ని తట్టుకోలేక ఇబ్బందులు పడతారు. అలాంటి వారు తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలి



చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో శీతాకాలంలో త్వరగా వ్యాధుల భారిన పడే అవకాశం ఉంది. పిల్లలకు తల్లి పాలు ఆరోగ్యకరం. వాటితో పాటు పోషకాహారాన్ని అందించాలి. పిల్లలు అనారోగ్యంగా ఉన్నప్పుడు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి. దీంతో శీతాకాలంలో చిన్నారులకు వచ్చే న్యూమోనియాను నివారించవచ్చు. చంటి పిల్లలను ఏసీల్లో, చల్లగాలికి ఆరుబయట తిప్పడం మంచిది కాదు.

– డాక్టర్ సునీత, చిన్నపిల్లల వైద్యురాలు

అప్రమత్తంగా ఉండాలి



గత కొద్ది రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు, చలి గాలులు, మంచు ప్రభావంతో చాలా మంది రోగాల భారిన పడుతున్నారు. దీంతో ఫీవర్‌కు రోగుల తాకిడి పెరుగుతోంది. చలితో పాటు పండగకు ఊళ్లకు వెళ్లొచ్చిన వారిలో చాలా మంది జ్వరాల భారిన పడుతున్నారు. సమయానికి సరైన ఆహారం తీసుకోకపోవడంతో ప్రజలు వ్యాధుల భారినపడుతున్నారు. కాచి చల్లార్చి వడకట్టిన నీటినే తాగాలి. వేడి ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలి. భోజనానికి ముందు తరువాత చేతులు శుభ్రం చేసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ కె.శంకర్, ఫీవర్ సూపరింటిండెంట్

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలో భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం ఎమ్మెల్యేతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. భీష్మ పితామహుడు గంగపుత్రులకు ఆరాధ్యుడని నెక్లెస్ రోడ్డులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

– ముషీరాబాద్, అంబర్‌పేట్ జోన్ బృందం

- నల్లకుంట తిలక్‌నగర్‌లో జరిగిన కార్యక్రమానికి అంబర్‌పేట్, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, స్థానిక కార్పొరేటర్ అమృత పాల్గొన్నారు. భజన మండలి అధ్యక్షుడు పూస నర్సింహ గంగపుత్ర, విశ్వామిత్ర తపోభూమి ఆశ్రమం అధిపతి భక్త సురేష్, భజన మండలి కార్యనిర్వాహకులు కాపరనేని లింగం, రాజభోస్, ముదారి పరుశురామ్, నర్సింగ్‌రావు, ధర్మేందర్, కుంట ఎల్లయ్య, నర్సింగ్‌రావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.
- కవాడిగూడలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, బాలయ్య, మల్లేష్, నగర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు చాట్ల సదానంద్, ప్రధాన కార్యదర్శి శంకర్, సంగీత తదితరులు పాల్గొన్నారు.
- దోమలగూడ జ్యోతినగర్‌లో జరిగిన కార్యక్రమంలో దోమలగూడ గంగపుత్ర సంఘం చైర్మన్ రమేష్, అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి శంకర్, సలహాదారులు ప్రభాకర్‌గంగపుత్ర, సంఘం నాయకులు ఎల్లయ్య, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.
- చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గుండెపూడి మురళీప్రసాద్, కార్యనిర్వాహణాధికారి దేవనాథంలు పర్యవేక్షించారు. దేవాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు డాక్టర్ రామకృష్ణ, జీ.కె.రమణ, గణేష్, పద్మ బాసాని, అర్చకులు లక్ష్మీపతిశర్మ, కందాల వెంకటాద్రి, పురుషోత్తమాచారి, కృష్ణమూర్తి, ఎస్‌బీవీఎస్ ఆచార్యులు, అలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విశ్వామిత్ర తపోభూమి ఆశ్రమాధిపతి సురేష్‌ను సన్మానిస్తున్న భజన మండలి ప్రతినిధులు



పాల్గొన్న ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్

'కేంద్ర బడ్జెట్‌లో దళితులకు ద్రోహం'



స్కైల్యాబ్ బాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితులకు ద్రోహం చేశారని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్ బాబు ఓ ప్రకటనలో విమర్శించారు. సంక్షేమ పథకాలను ఎత్తివేసి ఉపాధి నిధులను తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించడంలో దళితులకు ప్రభుత్వం ద్రోహం చేసిందని ఆరోపించారు. 20 శాతం దళితుల జనాభా ఉండగా.. కేవలం 16 శాతం నిధులను మాత్రమే కేంద్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ నిధులను కూడా సక్రమంగా ఖర్చు చేయడం లేదని ఆరోపించారు.

'రైతు సంక్షేమ బడ్జెట్'

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు సంక్షేమ బడ్జెట్ అని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్, రాష్ట్ర అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. బుధవారం కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో పాడి, పరిశ్రమ అభివృద్ధికి రూ.20 లక్షల కోట్లు కేటాయించడం హర్షనీయమన్నారు. బడ్జెట్‌లో సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం ఉండటంతో పాడిపరిశ్రమ, గోవుల అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందన్నారు. రైతులు, ముఖ్యంగా యువత వ్యవసాయ రంగాన్ని ఎంచుకునే అవకాశం ఉందన్నారు. ఈ బడ్జెట్‌తో వ్యవసాయ కార్మికులకు, రైతులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. రోజా దుర్గం, సుధాకర్, మాంజా తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రావులపాటి మోజెస్ పిలుపునిచ్చారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని శ్రీరామ్‌నగర్ బస్తీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబస్తీ మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తమవంతుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా ఉపాధ్యాయులు నేరుగా తమ దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యేతో చెప్పి పరిష్కరిస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు జయదేవ్, సంతోష్ తదితరులున్నారు.



శ్రీరామ్‌నగర్ బస్తీలో ప్రభుత్వ పాఠశాలను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

'కరీంనగర్‌ను రెండో రాజధాని చేయాలి'



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ జిల్లాను రెండో రాజధానిగా చేయాలని మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ వ్యవస్థాపక (ఎంటీఆర్ఎస్) అధ్యక్షులు టైగర్ అశోక్‌నేత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఎంటీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాపరిపాలన సౌలభ్యం కోసం ఉత్తర తెలంగాణ అభివృద్ధి చెందడానికి కరీంనగర్ జిల్లాను రాజధానిగా చేయాలని కోరారు. కరీంనగర్‌ను రాజధాని చేసేంత వరకు రాజీలేని పోరాటం చేస్తామని దీనికోసం వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, కళాకారులు తమ ఉద్యమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే అన్ని పార్టీలతో కలిసి సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'పింఛన్ కార్డుల పంపిణీలో వివక్ష చూపొద్దు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హిమాయత్‌నగర్ మండల పరిధిలోని పింఛన్ కార్డుల పంపిణీలో ప్రభుత్వ అధికారులు వివక్ష చూపడం సరికాదని ఈ పద్ధతిని మార్చుకోవాలని బీజేపీ నాయకులు, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి అన్నారు. ఆసరా ఫించన్‌లను పారదర్శకంగా మంజూరు చేయాలని, ప్రభుత్వ అధికారులు అధికార పార్టీ నాయకులుగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ హిమాయత్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బాగ్‌లింగంపల్లి లంబాడి తండాలో ఖాళీగా ఉన్న 9 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను రాంనగర్ డివిజన్‌కు చెందిన అర్హులైన పేదలకు కేటాయించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ వీవీఎల్ చంద్రకళకు ఆ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీ నేతలు శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు నరేష్, బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ నవీన్, మహిళా నాయకులు మంగళ, రమ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రవిచారి

అభివృద్ధి పనులు ప్రారంభం

ముషీరాబాద్: నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. బాపూజీనగర్‌లో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, కమలానెహ్రునగర్ రూ.11 లక్షలతో సీసీరోడ్డు, కమ్మరివీధిలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాపూజీనగర్‌లో రోడ్డు నిర్మాణ పనులకు ముందు కచ్చానాలా పైప్‌లైన్ పనులు పూర్తిచేసి రోడ్డు వేస్తామన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను పూర్తి చేశామని కమలానెహ్రునగర్‌లో దశాబ్దాలుగా డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఇబ్బందులను తొలగించేందుకు పైపులైన్ పనులను పూర్తి చేశామన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, సోమన్, ఆకుల అరుణ్‌కుమార్, శ్రీధర్ చారి, దీన్‌దయాల్‌రెడ్డి, భిక్షపతియాదవ్, ఎయిర్‌టెల్ రాజు, లక్ష్మణ్‌గౌడ్, ప్రశాంత్, సాంబశివరావు, నవీన్‌గౌడ్, అనిల్‌కుమార్, గడ్డం నవీన్ తదితరులున్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

సినీనటుడు బ్రహ్మానందంకు జన్మదిన శుభాకాంక్షలు



కాచిగూడ: సినీనటుడు డాక్టర్ బ్రహ్మానందం పుట్టిన రోజు సందర్భంగా ప్రముఖ సినీ అవార్డుల సంస్థ 'ఫిలిం అనలిటికల్ అండ్ అప్రిసియేషన్' (ఫాస్) ఆధ్వర్యంలో ప్రతినిధులు బుధవారం ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానందంను ఘనంగా సత్కరించి అభినందించారు. సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు, మంత్రి భుజంగరావు, కాశీ వీణాపాణిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డుకు ప్యాచ్‌వర్క్స్



కాచిగూడ: మౌలానా ఆజాద్‌నగర్ బస్తీ దవాఖాన వద్ద రోడ్డు గుంతల మయంగా మారడంతో సమస్యను స్థానికులు కాచిగూడ కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ సమస్యను జీహెచ్ఎంసీ అధికారులకు వివరించి బుధవారం రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను చేయించారు. బీజేపీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు బండారు సంతోష్‌కుమార్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్, మంగమ్మ పాల్గొన్నారు.

చేనేత బంధు ప్రవేశపెట్టాలి

చిక్కడపల్లి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో దళిత బంధు తరహాలోనే చేనేత బంధు ప్రవేశపెట్టి తక్షణమే రూ.10 లక్షలు చేనేత కార్మికులకు అమలు చేయాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కాదేవదాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేనేతకు సంబంధించిన అన్ని రకాల పన్నులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయాలని చేనేతలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఐదేళ్లకు ఒకసారి జరగాల్సిన సహకార సంఘాల ఎన్నికలు 2018 ఫిబ్రవరిలో ముగిసి ఐదేళ్లు గడుస్తున్నా.. ఎన్నికలు నిర్వహించకపోవడంతో చేనేత సహకార సంఘాలు నిర్వీర్యం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

- కొత్తగా చేనేత, మరమగ్గాలకు కార్పొరేషన్లకు స్పష్టత లేకపోవడం చేనేత కార్మికులను మరోసారి మోసం చేయడమేనని ఆయన పేర్కొన్నారు.
- ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం సబ్సిడీ రుణాలు అందకపోవడంతో చేనేత కార్మికుల జీవితం దయనీయంగా మారిందన్నారు.
- ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తక్షణమే చేనేత బంధు పథకం, చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేలా ప్రకటన చేయాలని లేని పక్షంలో చేనేత కార్మికుల సత్తా ఏమిటో వచ్చే ఎన్నికల్లో చూపిస్తామని హెచ్చరించారు. నాయకులు విజయకుమార్, స్వామి, ప్రకాష్‌రావు తదితరులున్నారు.



మాట్లాడుతుతున్న డాక్టర్ చిక్కాదేవదాసు

అసెంబ్లీలో ఓసీ కార్పొరేషన్ బిల్లు పెట్టాలి

కవాడిగూడ: బీఆర్ఎస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా రెడ్డి, వైశ్య కులాల్లోని పేదల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను తక్షణం ఏర్పాటు చేయాలని ఓసీ సామాజిక సంఘాల సమైక్య జాతీయ అధ్యక్షుడు, రైతు నాయకుడు పోలాడి రామారావు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఓసీ సమైక్య రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దురదృష్టకరమన్నారు. రెడ్డి సామాజిక వర్గాల పేదల సంక్షేమానికి రూ. 5 వేల కోట్లతో చట్టబద్ధమైన ప్రత్యేక రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

- ఓసీల్లోని ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు రూ.25 లక్షల ఆర్థికసాయం అందజేయాలని పేర్కొన్నారు.
- ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రెడ్డి కార్పొరేషన్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.
- రాష్ట్ర మంత్రులను దిగ్బంధం చేస్తామని ఓసీ సామాజిక వర్గాలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఓసీ సామాజిక సంఘాల సమైక్య జాతీయ సలహాదారులు కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పురుషోత్తమరావు, రెడ్డి జేఏసీ రాష్ట్ర నాయకులు నర్సింహ్మారెడ్డి, రామిరెడ్డి, రాజిరెడ్డి, ఆర్యవైశ్య సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు దీపక్‌బాబు, కరుణాకర్ రెడ్డి, రవీందర్‌రావు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోలాడి రామారావు